నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 4 నవంబర్ 2024 | NALGONDA



నల్లగొండలోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల మధ్య నిలిచిన వర్షం నీరు, (ఇన్‌సెట్‌లో)తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు



గడ్డిపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, తదితరులు

# రైతు కష్టం.. నీళ్ల పాలు

- కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన వడ్ల రాశులు
- వర్షానికి నేలవాలిన వరి పంటలు
- ఆందోళనలో అన్నదాత

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం

నల్లగొండ సిటీ, నవంబర్ 3 : ఆకాల వర్షం రైతులను ముంచుతున్నది. శనివారం అర్ధరాత్రి, ఆదివారం ఉదయం కురిసిన వాన రైతన్నను ఆగం చేసింది. ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభంకాకపోవడంతో తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల వడ్లు కొట్టుకుపోగా అన్నదాతలకు దుఃఖమే మిగిలింది. కనగల్ మండలంలోని కనగల్, జీ యడవల్లి, రామచంద్రాపురం, కురంపల్లి, అమ్మగూడెం గ్రామాల్లో ఆకాల వర్షానికి ఆపార నష్టం జరిగింది. అమ్మకానికి తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. దీంతో ఆరుగాలం తాము పడ్డ కష్టమంతా నీళ్లపాలైందని అన్నదాతలు కన్నీరుపెట్టారు. అధికారులు సకాలంలో తూకాలు వేసినట్లయితే ధాన్యం తడిసేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం రాలేదనే సాకుతో అధికారులు ధాన్యం కొనుగోళ్లను ఆలస్యం చేయడంతోనే ధాన్యం వర్షానికి కొట్టుకు పోయిందని రైతులు అంటున్నారు. కొట్టుకుపోయిన ధాన్యానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఏం చేయాలో తెలుస్తలేదు



నాకున్న నాలుగు ఎకరాల వరిని 12 రోజుల కిందట కోసి మాఊరు ఐకేపీ సెంటర్‌లో పోసిన. అప్పటి నుంచి కొంటరని ఎదురు చూస్తున్న. మొదట మా ఊరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే సంతోషపడ్డం. కానీ ఇప్పటివరకు కొనేటోళ్లు లేరు. ఇప్పుడేమే ఉన్న వండ్లు తడిసి ముద్దయినయి. ఏం చేయాలో తెలుస్తలేదు. రాత్రి వర్షానికి నాతోపాటు చాలా మంది రైతుల వడ్లు కొట్టుకుపోయినయి. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలె.

**- దేశిడి శేఖర్, కనగల్**

### ధాన్యం పోసి పది రోజులైంది



నాకు ఐదెకరాల పొలం ఉంది. కనగల్ ఐకేపీలో ధాన్యం పోసి 10 రోజులైంది. వడ్లు పోసిన తర్వాత నాయకులు వచ్చి అప్పుడే కొనేటట్లు చెప్పి ఐకేపీ సెంటర్‌ను ప్రారంభించిండ్రు. 15 రోజులైనా అతీగతి లేదు. పీడీ సారు వచ్చి వడ్లు కొనాలే అని చెప్పిండ్రు. అధికారులు గన్నీ సంచులు కూడా వేసిండ్రు. అయినా ఎవరూ కొనడం లేదు. మా సెంటర్‌లో ఇంత వరకు కాంటానే మొదలు కాలేదు. రోజూ ఆరబోసి కుప్ప పోస్తున్న. రాత్రి వచ్చిన వర్షానికి వడ్లు కొట్టుకు పోయినయి.

**- బారి శ్రీను, కనగల్**

### వడ్లు వెంటనే కొనాలె



నాకు ఏడెకరాల పొలం ఉంది. వరి కోసి పది రోజులైంది. మా ఊరు ఐకేపీ సెంటర్‌లో వడ్లు పోసిన. కానీ ఇప్పటికీ కొనేటోళ్లు లేరు. రాత్రి వచ్చిన వానకు వడ్ల రాశులపై నీరు చేరింది. వానొచ్చిన ప్రతి సారి ఆగమైతున్నం. ఇంత వరకు మావైపు ఏఓ గానీ ఏపీఎంగానీ రాలే. ప్రభుత్వమే మాకు జరిగిన నష్టంపై పరిహారం ఇవ్వాలి.

**- పాలకూరి వెంకటేశం, కనగల్**



కనగల్ మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

### కేంద్రాల్లో తడిసిన ధాన్యం

కేతేపల్లి : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కోత దశకు వచ్చిన వరి పొలాలు నేలవాలాయి. కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం పూట పట్టాలు వేసి ధాన్యాన్ని ఆరబెట్టే ప్రయత్నం చేశారు. అలాగే వర్షానికి ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి చేలపై తడిసింది.



కేతేపల్లి : ఇనుపాముల ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



పెద్దఅడిశర్లపల్లి : వర్షానికి పీఏపల్లిలో నేలకొరిగిన వరి పంట

### అమరవరంలో..

హుజూర్‌నగర్ రూరల్ : అకాల వర్షంతో హుజూర్‌నగర్ మండలం అమరవరంలో 60ఎకరాలకు పైగా వరి పంట నేలవాలింది. పంట చేతికి వచ్చే దశలో వర్షం నిండా ముంచిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



హుజూర్‌నగర్ రూరల్ : అమరవరంలో నేలకు వాలిన వరి పైరు

### 200 క్వింటాళ్ల ధాన్యం తడిసింది

గుర్రంపోడ్ : మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో 200 క్వింటాళ్ల ధాన్యం తడిసిందని మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి తెలిపారు. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టాలని, ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. మండలంలోని చామలేడు, కొయగూరోని బావి ఐకేపీ కేంద్రాల్లో 8 మంది రైతులకు చెందిన ధాన్యం తడిసిందని తెలిపారు.



గుర్రంపోడ్ : చామలేడు ఐకేపీలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

### వర్షానికి తడిసి ముద్దయిన వరి ధాన్యం

తిప్పర్తి : మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి తడిసి ముద్దయ్యింది. దాంతో రైతన్నలు ధాన్యం ఆరబెట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు తేమ శాతం పేరుతో వడ్లు కాంటాలు పెట్టక నిర్లక్ష్యం వహించడంతోనే ఈ కష్టం వచ్చిందని రైతులు చెబుతున్నారు. వర్షంలో ధాన్యం కొట్టుకుపోగా వాటిని ఎత్తుకోవడంతో పాటు వర్షపు నీటిని తొలగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని కేంద్రాలలో వడ్లు కాంటా పెట్టినప్పటికీ లారీల కొరతతో లోడ్ ఎత్తకపోవడంతో ధాన్యం గోనె సంచుల్లోనే ఉన్నాయి. మరోవైపు వరి చేలు వర్షానికి అడ్డం పడడంతో రైతన్నలు దిగులు చెందుతున్నారు.



తిప్పర్తి : పజ్జూరు ఐకేపీ కేంద్రంలో లారీలు రాక గోనె సంచుల్లో ఉన్న వరిధాన్యం

### అధికారులు వడ్లు కొనేటట్లు చూడాలి



వర్షం వరుసగా వస్తుండడంతో వడ్లు ఆరబోసుకోలేక పోతు న్నాం. అధికారులేమో తేమశాతం 17కంటే తక్కువగా ఉంటేనే కొంటాం అంటున్నరు. శనివారం కురిసిన వర్షానికి వడ్లు మొత్తం తడిసి నీటిలో కొంత కొట్టుకపోయినాయి. అధికారులు మిల్లర్లతో మాట్లాడి వడ్లు వెంటనే కొనేటట్లు చూడాలి.

**- దాసరి జానయ్య, జంగారెడ్డిగూడెం, తిప్పర్తి**

### కాంటాలు త్వరగా వేయాలి



కాంటాలు త్వరితగతిన పెడితే కొంత నష్టం తగ్గేది. నేను వారం రోజుల కింద వడ్లు తెచ్చాను. తేమ శాతం రాలేదని ఆపారు. దీంతో వర్షం వల్ల వడ్లు పూర్తిగా తడిచాయి. వర్షం విడుతల వారీగా వస్తుంటే వడ్లు ఆరబెట్టాలంటే తీవ్ర ఇబ్బంది అవుతుంది. వెంటనే కాంటాలు పెట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**-పాల్వాయి సంజీవరెడ్డి, రైతు తిప్పర్తి.**

# ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

- విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం
- 20నెలల్లో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- గడ్డిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

గరిడేపల్లి, నవంబర్ 3 : విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో వసతులు కల్పిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో రూ.200కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆదివారం ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు రవాణా భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో భట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే కోరి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. దీపావళి పండుగ రోజు 7.50లక్షల మంది నిరుపేద విద్యార్థుల కోసం మెస్, కాస్మోటిక్స్ చార్జీలు ఒక్కసారిగా 40శాతం పెంచుతూ ఆదేశాలు విడుదల చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. ఒకే ఏడాదిలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం రూ.5వేల కోట్లు కేటాయించామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. 20 నెలల్లో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామన్నారు. వానకాలంలో 150లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించాలని, సన్నరకాలకు రూ.500బోనస్ ఇస్తున్నామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఊటీ లాంటి చెరువులు, చెట్లు, గుట్టల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి నాణ్యమైన విద్యను అందించేందుకు గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పాఠశాలకు డబుల్ రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు, జడ్పీ సీఈఓ అప్పారావు, మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, తాసీల్దార్ బండ కవిత, ఎంపీడీఓ సరోజ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీలు కటకం ఆశ రమేశ్, పైడిమర్రి రంగనాథ్, ఎల్ 27లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ సుందరి నాగేశ్వర్‌రావు, ఆరెపురి నారాయణ, బాణోతు శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అయిటిపాముల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

# రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**పది నెలల్లో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరం : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

కట్టంగూర్, నవంబర్ 3 : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. కట్టంగూర్ మండలం అయిటిపాములలో ఆదివారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. పండించిన పంటలను కొనుగోలు చేయలేని దిక్కుమాలిన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లాలో ప్రతి సంవత్సరం దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 60 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేదని తెలిపారు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో కేసీఆర్ ప్రభుత్వం 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రం కొనుగోలు చేయడం సిగ్గుచేటన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, మిల్లర్లను సమన్వయం చేయడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఘోరంగా విఫలం చెందారని అన్నారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రణాళిక లేకుండా ఆర్భాటంగా ధాన్యం కేంద్రాలను ప్రారంభించి మళ్లీ తిరిగి చూసే పరిస్థితులు లేవన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరుగకపోవడంతో రైతులు తక్కువ ధరకు ప్రైవేట్‌లో అమ్మి నష్టపోవాల్సి వస్తున్నదని చెప్పారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం భేషరతుగా వెంటనే కొనుగోలు చేసి, బోనస్ రూ.500వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు బెల్లి మహాలక్ష్మీసుధాకర్, నలమాద వీరమ్మ సైదులు, మాజీ సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి. మల్లెబోయిన శ్రీలతకృష్ణ, నరేందర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# నేటి తరం విద్యార్థులను యువ రచయితలుగా తయారు చేయాలి

- ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు

రామగిరి, నవంబర్ 3: నేటి తరం విద్యార్థులను యువ రచయితలుగా తయారు చేయాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా వారిని సాహిత్య అంశాలపై చైతన్యం చేసి నూతన రచనలు వెలుగులోకి తేవాలని ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. సాహిత్య రంగంలో అభ్యుదయ సాహిత్యం నుంచి ఇప్పటి వరకు వచ్చిన సాహితీ సంస్థలు, వాటి దృష్టి కోణాలు, పరిమితుల గురించి వివరించారు. ఇన్నాళ్లు అణగారిన వారి జీవితాలపై ఆధిపత్యం చేసిన మత దురహంకారం మళ్లీ పడగా విప్పి విజృంభిస్తున్నదన్నారు. ఇది సాధారణ ప్రజల జీవితాలకు ప్రమాదమని, వాటిని ప్రశ్నించే వైఖరితో రచయితలు, కవులు స్పందించాలని తెలియచేశారు. ముఖ్యంగా విద్యార్థులైన యువ రచయితలు ఈ పనికి పూనుకోవాలన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అనందాచారి మాట్లాడుతూ సమజం సమూహం నుంచి చీలి ఒంటరి తనంలోకి వెళ్లిపోవడం చాలా ప్రమాదకరమని తెలిపారు. కవులు, రచయితలు స్తబ్ధత నుంచి బయటపడి సరికొత్త సృజనకు ఉపక్రమించాలని, అందుకోసం సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఇదే సభలో స్వీయ కవితల్లో వస్తువుపై జీవకవి అనే అంశంపై మునాస్ వెంకట్, స్వీయ కథల్లో సామాజిక జీవన చిత్రాలపై ప్రముఖ కథా రచయిత భూతం ముత్యాలు, స్వీయ గీతాల్లో సామాజిక స్పృహపై ప్రముఖ గాయకుడు అంబటి వెంకన్న, కవి సమ్మేళనంలో పలువురు కవులు ప్రసంగించారు. సాయంత్రం జరిగిన ముగింపులో తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 147మంది విద్యార్థులు కవితలు రాయగా వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సోలేషన్ బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంతజు మోహనకృష్ణ, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ప్రముఖ కవులు, సాహితీవేత్తలు సాగర్ల సత్తయ్య, తండు కృష్ణకౌండిన్య, బండారు శంకర్, పెరుమాళ్ల ఆనంద్, చింతోజు మల్లికార్జునచారి, బాసరాజు యాదగిరి, నాగిరెడ్డి, అరుణ జ్యోతి, తరుణోజు భీష్మాచారి, గేర నరసింహ, బూర్గు గోపీకృష్ణ, హసేన, లయన్స్ వనం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు..

## కేంద్రాల్లో ప్రారంభం కాని కాంటాలు..

- ధర తక్కువైనా ధాన్యం అమ్మేందుకు తరలింపు
- వారం పది రోజులుగా ఎదురుచూసి రైతన్న నిరాశ

నల్లగొండ రూరల్, నవంబర్ 3 : పల్లెల్లో ఎక్కడ నలుగురు కలిసి మాట్లాడుకున్నా కొనుగోలు కేంద్రాల్లో చక్కగా ధాన్యం కొంటలేరని. కొన్నా వెంటనే డబ్బులు పడుతాలేవని.. గత ప్రభుత్వం సకాలంలో ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసిందని, వెంటనే ధాన్యం డబ్బులు వేసిందనే ముచ్చటలే వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఎక్కడా సక్రమంగా కొనుగోళ్లు జరుగడం లేదు. ధాన్యం రాశులు మ్యాచర్ వచ్చినప్పటికీ సెంటర్లకు మిల్లులు కేటాయించ లేదు. అరకొర లారీలే రావడం, వచ్చిన లారీలను గోదాముల్లో సకాలంలో దిగుమతి చేసుకోకపోవడంతోపాటు అకాల వర్షంతో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలానే ఉంటే ఆగమై రోడ్డు పడుతామనే ఉద్దేశంతో రైతన్నలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని తిరిగి ట్రాక్టర్లకు ఎత్తుకొని మిల్లులకు తరలిస్తున్నారు. కొందరు రైతులు కూలీల ద్వారా ట్రాక్టర్లు నింపుతుండగా, మరి కొందరు రైతులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్లు నింపి మిల్లులకు తరలించారు. నల్లగొండ మండలంలోని దండంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సుమారు 10 ట్రాక్టర్లలో 400 క్వింటాళ్ల ధాన్యం, రెడ్డి కాలనీ కొనుగోలు కేంద్రంలో 8 ట్రాక్టర్లలో 320 క్వింటాళ్ల మేర మిల్లులకు రైతులు తరలించుకున్నారు. ఇలా అయితే మద్దతు ధర రాదని తెలిసినా కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి ఉండదని రైతులు వాపోయారు.



కాంటాలు వేయక పోవడంతో రెడ్డి కాలనీలోని కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న జేసీబీ



దండంపల్లి కొనుగోలు కేంద్రంలో ట్రాక్టర్లలోకి ధాన్యం ఎత్తుతున్న రైతులు

### కొనుగోలు కేంద్రాల్లో కొంటరనే నమ్మకం పోయింది



హడావుడిగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినా కొనుగోళ్లు అరకొరగా అవుతున్నాయి. మా దండంపల్లి సెంటర్‌లో ఇప్పటి వరకు నాలుగు లారీలు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. నా ధాన్యం మ్యాచర్ వచ్చింది. కాంటా మాత్రం వేయలేదు. అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. దిక్కుతోచని స్థితిలో పెట్టిన పెట్టుబడి అయినా వస్తదని మిల్లులకు అమ్ముకునేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నా.

**- నేరటి పరమేశ్, దండంపల్లి, రైతు**

### గత ప్రభుత్వ హయాంలో ఇన్ని బాధలు పడలే



మాది దండంపల్లి.. 10 ఎకరాలు కౌలుకు తీసుకొని వరిసాగు చేసినం. రెడ్డి కాలనీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసినం. 20 రోజులు అయినా కొనుగోళ్లు చేయడం లేదు. అదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. ఇప్పట్లో ధాన్యం కొంటరే లేదో క్లారిటీ లేదు. చేసేది ఏమిలేక నాకు నష్టం అయినా పర్లేదని జేసీబీ సహాయంతో మిల్లర్లకు తరలిస్తున్నా. గత ప్రభుత్వం హయాంలో ఇన్ని ఇబ్బందులు పడలేదు.

**- పామనుగుండ్ల పరమేశ్, దండంపల్లి, రైతు**